అక్రమార్కులపై ఉక్కుపాదం

- మద్యం, ఇసుక రవాణాపై పోలీసుల ప్రత్యేక దృష్టి
- మొబైల్, స్పెషల్ పార్టీలతో చెక్
- రెండేళ్లలో 600కు పైగా మద్యం, 57 ఇసుక అక్రమ రవాణా కేసుల నమోదు

పెనుకొండ రూరల్: అక్రమ మద్యంతో పాటు ఇసుక తరలింపుపై కూడా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. అక్రమార్కులపై పోలీసులు, సెబ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా రవాణా కాకుండా ప్రత్యేక దృష్టిసారించారు. ముఖ్యంగా పొరుగు రాష్ట్రమైన కర్ణాటక నుంచి విచ్చలవిడిగా మద్యాన్ని తీసుకొస్తూ దందా చేస్తున్న వారిపై నిఘా పెట్టారు. ఇన్‌ఫార్మర్లతో పాటు స్పెషల్ టీములు, మొబైల్ పార్టీ పోలీసుల సహాయంతో ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేస్తున్నారు. మద్యం కేసుల్లో ఎవరు పట్టుబడినా వెంటనే చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తూ కటకటాల్లోకి పంపుతున్నారు. 2022 జనవరి నుంచి నేటి వరకు పెనుకొండ ప్రాంతంలో 10, సోమందేపల్లిలో 50, పరిగిలో 61, గోరంట్ల మండలంలో 35, రొద్దంలో 200 అక్రమ మద్యం కేసులను సివిల్ పోలీసులు నమోదు చేశారు.



పెనుకొండ సమీపంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న 170 బాక్స్‌ల లిక్కర్ (ఫైల్)

అక్రమ మద్యం కేసుల వివరాలు		
సంవత్సరం	నమోదైన కేసులు	సీజ్ చేసిన వాహనాలు
2020	109	75
2021	161	66
2022	368	47
2023 (ఇప్పటిదాకా)	277	31

ఇసుకాసురులపై దృష్టి

పెనుకొండ నియోజకవర్గంలో అక్రమ ఇసుక రవాణ కట్టడిపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. ఇక్కడ ఉన్న నదీ తీర ప్రాంతంతో పాటు వాగులు, వంకల నుంచి గతంలో పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తూ అక్రమార్కులు జేబులు నింపుకునే వారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇసుక దందాపై కొరాఢా ఝులిపించింది. ప్రభుత్వమే ఇసుకకు ధర నిర్ణయించి దాని ప్రకారమే సరఫరా చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఇక.. నియోజకవర్గంలో ఎక్కడా ఇసుకను అక్రమంగా తరలిపోకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే 2022 జనవరి నుంచి నేటి వరకు 57 కేసులను నమోదు చేశారు. పెనుకొండ ప్రాంతంలో 10, సోమందేపల్లిలో 6, పరిగిలో 31, రొద్దంలో 10 కేసులను నమోదు చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకున్నారు. కేవలం అనుమతులు ఉన్న వాహనాలకు మాత్రమే ఇసుక తరలింపునకు అనుమతిస్తున్నారు.



పెనుకొండ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసిన దృశ్యం (ఫైల్)

ఎవరినీ ఉపేక్షించం



అక్రమ మద్యం, ఇసుక తరలింపుపై అధికారుల ఆదేశాలమేరకు కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఎంతటి వారినైనా ఉపేక్షించబోము. పెనుకొండ ప్రాంతం కర్ణాటకకు సరిహద్దు ప్రాంతం కావడంతో మద్యంతో పాటు గంజాయి లాంటి వాటిపై కూడా ప్రత్యేక దృష్టిసారించాము. జాతీయ రహదారిపై తనిఖీలు ముమ్మరం చేసి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్నాము.

– కరుణాకర్, సీఐ , పెనుకొండ

అక్రమాలకు అడ్డుకట్ట



స్పెషల్ టీములు, మొబైల్ పార్టీలు ఇన్ఫార్మర్ల ద్వారా అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపుతున్నాం. కర్ణాటక ప్రాంతం నుంచి జిల్లాలోకి మద్యం తరలిరాకుండా అన్ని చర్యలు చేపట్టాం. నేరచరిత్ర ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారించి వారి కదలికలను గమనిస్తున్నాం. ఎప్పటికప్పుడు స్వాధీనం చేసుకున్న మద్యాన్ని ధ్వంసం చేస్తున్నాం. సీజ్ చేసిన వాహనాలను వేలం వేస్తూ వచ్చిన డబ్బును ప్రభుత్వానికి జమ చేస్తున్నాం.

– వెంకట సుబ్బారెడ్డి, సెబ్ సీఐ, పెనుకొండ

ఘనంగా సిద్ధేశ్వరస్వామి గ్రామోత్సవం

అమరాపురం: మండల పరిధిలోని హేమావతిలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి ఆదివారం భక్తులు ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. మొదటి శ్రావణ మాసం ఆదివారం సందర్భంగా అర్చకులు స్వామికి ఉదయం సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి భక్తులు తెచ్చిన వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళహారతి ఇచ్చారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో గ్రామ వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. మడకశిర నియోజకవర్గం నుంచే కాకుండా సమీప కర్ణాటక ప్రాంతాలైన శిర, బెంగళూరు, తుమకూరు, పావగడ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.



సిద్ధేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



రొళ్ల: టీడీ పల్లిలో సిద్ధేశ్వరస్వామికి పూజలు చేసిన దృశ్యం

రొళ్ల: మండలంలోని టీడీ పల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ప్రతిమకు వెండి ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహామంగళారతి ఇచ్చారు. శ్రావణ మాసం కావడంతో స్వామివారి దర్శనం కోసం గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

వేడుకగా కనకదాసు విగ్రహ ప్రతిష్ట



ఎమ్మెల్యే శంకరనారాయణను సన్మానిస్తున్న కురుబ సంఘం నాయకులు

పెనుకొండ రూరల్: భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. ఆదివారం మండలంలోని చంద్రగిరి గ్రామంలో నూతనంగా నిర్మించిన కనకదాసు విగ్రహాన్ని ఎమ్మెల్యే చేతుల మీదగా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగిన మహోన్నతమైన వ్యక్తి కనకదాసు అన్నారు. తన తత్వజ్ఞానాన్ని సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తెలియజేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గీత, సర్పంచ్ గౌతమి, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, కురుబ సంఘం నాయకులు వెంకటరాముడు, మల్లికార్జున, కప్పల నారాయణ, నంజప్ప, చంద్రశేఖర్, పెద్దన్న, శ్రీకాంత్ రెడ్డి, నాగరాజు.తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని కాశీ విశ్వేశ్వర ఆలయంలో ఆదివారం జరిగిన నాగుల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాశీ విశ్వేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం నాగుల ప్రతిష్టలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ కమిటీ పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. చేశారు. కార్యక్రమంలో ఏజీపీ భాస్కరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరు బాబు, ముఖ్యనాయకులు రామ్మోహన్‌రెడ్డి, కొండలరాయుడు, వైద్యులు రంగనాథరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీ వేంకటేశ్వరునికి పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి

మడకశిరరూరల్: మండల పరిధిలోని సంకమ్మనపాళ్యం గ్రామంలోని దేవాలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు స్థిర,చర, బింబ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. నీలకంఠేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డితో పాటు భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

డ్రైవింగ్ వృత్తికే వన్నె తెచ్చిన అంజేనాయక్

పెనుకొండ: ఆర్టీసీ డ్రైవర్ అంజేనాయక్ డ్రైవర్ వృత్తికే వన్నెతెచ్చారని ఆల్‌ఇండియా బంజారా సంఘం నాయకులు పేర్కొన్నారు. ఇటీవల ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్‌గా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న పెనుకొండ డిపోకు చెందిన అంజేనాయక్‌ను పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఆల్ ఇండియా బంజారా సంఘం నాయకులతో పాటు ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్‌నాయక్, భాస్కర్‌నాయక్, నారాయణనాయక్, లాయర్ విశ్వనాథ్‌నాయక్, హనుమంతనాయక్, గోవిందనాయక్, చంద్రానాయక్, గంగాధర్‌నాయక్, బాపూజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అంజేనాయక్‌ను సన్మానిస్తున్న ఆల్‌ఇండియా బంజారా సంఘం నాయకులు

బాల్య మిత్రునికి ఆర్థిక సాయం



విజయేంద్ర గుప్తాకు ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

గోరంట్ల: నాలుగు దశాబ్దల క్రితం గోరంట్ల ఉన్నత పాఠశాలలో తమతో పాటు చదువుకొని ఆర్థిక ఇబ్బందులతో ఉన్న బాల్యమిత్రునికి స్నేహితులు ఆర్థిక సాయం చేశారు. 1976–77 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విజయేంద్ర గుప్తా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. విషయం తెలుసుకున్న నాటి స్నేహితులంతా కలిసి రూ.61 వేలు ఆర్థికసాయం చేశారు. దాతల సహకారంతో మరో రూ.20 వేలను అందజేశారు. ఈ సందర్భంగా విజయేంద్ర గుప్తా స్నేహితుల బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు



మైనర్ నుంచి వాహనాన్ని స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం

లేపాక్షి: మైనర్లు వాహనాలు నడిపితే వారితో పాటు వారి తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మునీర్‌అహమ్మద్ తెలిపారు. ఆదివారం సాయంత్రం లేపాక్షి బస్టాండు పరిధిలో వాహనాలు నడుపుతున్న మైనర్లను ఆపి వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ డబుల్, ట్రిబుల్ డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు కొనితెచ్చుకున్నట్లేనని చెప్పారు. పిల్లలకు ఏమైనా ప్రమాదం జరిగితే ఆ కుటుంబాలు నష్టపోతాయని సూచించారు.

మురుగు నీటితోనే దోమల వృద్ధి

పరిగి: మురుగు నీటితోనే దోమలు వృద్ధి చెందుతాయని మెడికల్ ఆఫీసర్లు స్వరూపరెడ్డి, నవీన తెలిపారు. ఆదివారం ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకొని పరిగిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తొలుత దోమల వల్ల కలిగే నష్టాలు, నివారణోపాయాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇళ్లతో పాటు పరిసరాల్లో మురుగు నీరు లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దీంతో పాటూ ఇళ్లలో నీటిని ఎక్కువ కాలం నిల్వ ఉంచుకోకూడదన్నారు. కార్యక్రమంలో ఊటుకూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌కుమార్, సీహెచ్‌ఓ వన్నప్ప, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యసిబ్బంది

పావగడలో భక్తుల సందడి



స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకుడు



దైవ దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

పావగడ: శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం కూడా స్థానిక శనీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే భక్తులు శనీశ్వరుడిని దర్శించుకుని పూజలు నిర్వహించేందుకు క్యూ కట్టారు. శని దోష నివారణ పూజలకు సంబంధించి సర్వ సేవా పూజల్లో భాగంగా శనీశ్వరుని తైలాభిషేక పూజలకే భక్తులు ఎక్కువ మొగ్గు చూపారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఫ్రీ బస్సుల్లో మహిళలు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం మహిళా భక్తులతో కిటకిట లాడింది. శని దోష నివారణకు భక్తులు ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన అగ్ని గుండంలోకి తొమ్మిది నల్లవత్తులు సమర్పించి తొమ్మిది సార్లు అగ్ని గుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దీక్షా మంటపంలో స్వామి వారికి తల నీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రంలో ఆదివారం సర్పంచ్ చిన్న గంగప్ప ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అనంతపురం మార్క్ సూపర్ స్పెషాలిటీ గుండె ఆస్పత్రి వైద్యాబృందం ఉచిత వైద్యాశిబిరం నిర్వహించింది. ఈ సందర్భంగా 210ని పరీక్షించి 40 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. ఆరోగ్యశ్రీ కింద వారికి ఉచితంగానే వైద్యసేవలు అందించనున్నట్లు అమర్ మహేష్, కార్డియాలజిస్ట్ హర్షద్ తదితరులు తెలిపారు.

హిందూపురం అర్బన్: ఆరోగ్యమే మహాభాగ్యమని డాక్టర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గోళ్లాపురంలో ఆదివారం రామకృష్ణారెడ్డి ఫౌండేషన్, నారాయణ హృదయాలయ ఆధ్వర్యంలో వివిధ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

లేపాక్షిలో అన్నదానం

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. పెద్ద ఎత్తున భక్తులు ఆలయ పరిసరాలను సందర్శించారు. దేవాయాన్ని సందర్శించడానికి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన పర్యాటకులకు అన్నదానసత్రంలో ఆలయ కమిటీ సభ్యులు భోజనాన్ని ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

సోమందేపల్లి: మండలంలోని మేకలపల్లి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. నాగలూరు గ్రామానికి చెందిన ముత్యాలప్ప అనే వ్యక్తి 140 కర్ణాటక మద్యం ప్యాకెట్లు విక్రయించడానికి తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అతన్ని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. 140 మద్యం ప్యాకెట్లు సీజ్ చేశామన్నారు. ముత్యాలప్పను కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారని చెప్పారు.

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గస్థాయి సమావేశం

హిందూపురం: పట్టణంలోని స్థానిక ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గస్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక ఒక ప్రకటనలో తెలిపారు. హిందూపురం పట్టణ, మండలంతో పాటు లేపాక్షి, చిలమత్తూరు మండల గ్రామ, వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పార్టీ మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచులు, రాష్ట్ర డైరెక్టర్లు, వార్డు సభ్యులు, రాష్ట్రకార్యదర్శులు, అన్ని అనుబంధ విభాగ సంఘ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హిందూపురంటౌన్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 80వ జయంతిని పురస్కరించుకుని రైల్వే రోడ్డులోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు బాలాజీ మనోహర్ మాట్లాడుతూ సాంకేతిక, విజ్ఞానపరంగా కంప్యూటర్స్, టెలికాం, రక్షణ రంగాల్లో భారత దేశాన్ని అభివృద్ధి పథం నడిపి నాయకుడు రాజీవ్‌గాంధీ అని కొనియడారు. కార్యక్రమంలో అమనుల్లా, జమీల్, ఆసీఫ్‌బాషా, నాగరాజు, ఆసీఫ్, మహబూబ్‌బాషా, సమీవుల్లా, గంగాధరప్ప, ఎండీ గౌస్, ఆయాజ్, అజ్మతుల్లా, తిరుపాల్, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆవు అపహరణ

గోరంట్ల: మండల పరిధిలోని మల్లాపల్లి గ్రామ సర్పంచ్ శివానందకు చెందిన ఆవు ఆదివారం అపహరణకు గురైంది. ఆవు విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని శివానంద తెలిపారు. మల్లాపల్లి గ్రామంలోని గోకుల ఆశ్రమంలో షెడ్‌లో ఉంచిన ఆవును తెల్లవారుజాము సమయంలో దుండగులు ఎత్తుకెళ్లారన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

మట్కా బీటర్ల అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని పాత ఊరు ప్రాంతంలో ఇద్దరు మట్కా బీటర్లను ఆదివారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6000 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు చెప్పారు.

పేకాట కేంద్రంపై దాడి

మడకశిర: మండలంలోని ఎం రంగాపురం వద్ద ఆదివారం పేకాట కేంద్రంపై దాడి చేసి ఆరుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ లోకేశ్ తెలిపారు. వారి నుంచి రూ.12,050 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

రొద్దం: మండల కేంద్రంలోని రొద్దకాంబ మండల సమాఖ్య భవనంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రొళ్ల: మండలంలోని హొట్టేబెట్ట సచివాలయం పరిధిలో హొట్టేబెట్ట, కల్లురొప్పం, కె.గొల్లహట్టి గ్రామాల్లో సోమవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కల్లుమడి ఆజాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తిప్పేస్వామి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



అమరాపురంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం నాగుల చవితి పండుగను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. శ్రావణమాసం చవితి సందర్భంగా ఆదివారం బ్రహ్మణులు, ఆర్యవైశ్యులు తదితరులు ఉదయం ఉపవాస దీక్షతో తలంటు స్నానాలచారించి స్థానికంగా వున్న నాగుల ప్రతిమ, పుట్ట వద్దకు వెళ్లి ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా బియ్యం పిండితో చేసిన శనగ ఉంటలు, పండ్లు నైవేద్యంగా పెట్టారు. అనంతరం పూలతో అలంకరించి నాగుల పుట్టకు పూజలు చేశారు. అనంతరం పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఇంటికి వచ్చి విందు భోజనాలు తయారు చేసి ఉపవాస దీక్షలు వదిలారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెనుకొండ: మక్కాజిపల్లి సమీపంలో రైలు కింద పడి వైఎస్సార్‌సీపీ నాయకుడు వడ్డే అశోక్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే శవాన్ని స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకరనారాయణ ఆదివారం ఉదయం ఆస్పత్రికెళ్లి అశోక్ భార్య సాలమ్మతో పాటు కుమార్తెలను పరామర్శించారు. అధైర్య పడొద్దు... అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు నరసింహమూర్తి, సర్పంచ్ అంజేనాయక్, ఎల్లారెడ్డి, సోమందేపల్లి ఉపసర్పంచ్ వేణు తదితరులున్నారు.

నేటి నుంచి ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ముస్తాబైన యర్రగోడపల్లి ఆంజనేయస్వామి దేవాలయం

మడకశిరరూరల్: మండల పరిధిలోని యర్రగోడపల్లి తండా గ్రామంలో సోమవారం నుంచి 23వ తేదీ వరకూ యర్రగోడపల్లి ఆంజనేయస్వామి ధ్వజస్తంభ, కలశ పున:ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, జలాధివాసం, మంగళవారం పుణ్యాహవాచనం, యాగశాల కుంభస్థాపన, శాంతి హోమం, ఆంజనేయస్వామి మూల వస్త్ర గాయిత్రీ హోమం తదితర పూజలు నిర్వహిస్తారు. బుధవారం జ్యోతుల ఉత్సవం, ఆంజనేయస్వామి ధ్వజ స్తంభ, కలశ పున: ప్రతిష్ఠాపన తదితర పూజా కార్యక్రమాలను జరుగుతాయన్నారు.

మూర్ఛవ్యాధిపై అపోహ వీడండి

హిందూపురం: మూర్ఛవ్యాధిగ్రస్తులు అపోహలు విడనాడి మందులు వినియోగిస్తూ వైద్యుల సలహాలు పాటిస్తే వ్యాధి నయమవుతుందని జేవీవీ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఈటీ రామ్మూర్తి అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆల్‌హిలాల్ స్కూల్‌లో 118వ ఉచిత మూర్ఛవ్యాధి చికిత్స శిబిరం జరిగింది. వైద్య శిబిరంలో 155 మంది రోగులను పరీక్షలు చేసి రెండు నెలలకు సరిపడే మందులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్మూర్తి మాట్లాడుతూ మూర్ఛవ్యాధిగ్రస్తులు వివాహాలు, ఉద్యోగం, సంసారానికి పనికిరారని చెప్పడం హాస్యాస్పదమన్నారు. మూర్ఛవ్యాధిగ్రస్తులు నిప్పు, నీటి ప్రవాహాలు, ఎతైన కొండ అంచుల వద్ద వెళ్లడం మంచిదికాదన్నారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు జీఆర్ శ్రీనివాసులు, రామకృష్ణ, అతావుల్లా, అంజనారెడ్డి, నాగరాజుగుప్త, ఉగ్రప్ప, ప్రభాకర్, అబ్దుల్‌హక్, ఎం.రామకృష్ణా, లక్ష్మీపతి, మంజునాథ, సుబ్రమణ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.